TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 302 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.28.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## సరిహద్దులకు 15 కి.మీ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి: అమిత్ షా



రాజస్థాన్, అమృత్ తెలంగాణ: దేశ సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు. ఈ అంశంలో రాజీలేని విధానాన్ని అమలు చేయాలన్నారు. రాజస్థాన్‌లోని భారత్–పాక్ సరిహద్దు జిల్లాల్లో భద్రతా పరిస్థితులపై అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆయా జిల్లా కలెక్టర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.

'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్'

అలాగే సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని బ్యాంకింగ్ లావాదేవీల్లో చట్టపరమైన, ఆర్థికపరమైన నిబంధనల అమలును పర్యవేక్షించాలని కేంద్ర హోంశాఖ పేర్కొంది. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, వాటికి అందుతున్న నిధుల మూలాలను పరిశీలించాలని తెలిపింది. మ్యూల్ అకౌంట్లు, నకిలీ కంపెనీ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ఉండాలని సూచించింది. నకిలీ ఆధార్ కార్డులను గుర్తించడంతో పాటు సరిహద్దుల గుండా జరిగే స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లను హోంశాఖ ఆదేశించింది. సరిహద్దు జిల్లాల్లో జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ మహమ్మారి వెనుక ఉన్న నెట్‌వర్క్‌లపై లోతైన అధ్యయనం చేయాలని సూచించింది. ఈ సమస్యలు మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని స్పష్టం చేసింది. సరిహద్దు జిల్లాల జనాభాకు మద్దతుగా నిలవడానికి, మౌలిక సదుపాయాల కొరతను తీర్చడానికి వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా అమలు చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తన ప్రకటనలో తెలిపింది.

360–డిగ్రీల భద్రతా కవచానికి ఏర్పాటు

ప్రతి సరిహద్దు జిల్లాకు పౌరులు, ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా సంస్థలతో కూడిన 360–డిగ్రీల భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయాలని అమిత్ షా చెప్పారు. ముఖ్యంగా అంతర్గత సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, అటువంటి నిర్మాణాలన్నింటినీ కూల్చివేయాలని హోం మంత్రి పిలుపునిచ్చారు. చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఆక్రమణలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఇతర సరిహద్దు నేరాల వంటి సమస్యలను పరిష్కరించడానికి బీఎస్ఎఫ్, సీబీడీటీ, ఎన్‌సీబీ, ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యంతో సరిహద్దు నిర్వహణకు సమన్వయ విధానం అవసరమన్నారు. ఈ సమావేశంలో సరిహద్దు గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పథకాలు నూటికి నూరు శాతం అందేలా చూడాలని అమిత్ షా ఆదేశించారు. అలాగే సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి '1930' కాల్ సెంటర్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ అంశాలపై రెండు నెలల తర్వాత తిరిగి సమీక్ష, అభిప్రాయ సేకరణ చేపడుతారని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలు ఫలిత ఆధారిత చర్యలను నిర్ధారించుకోవాల్సి ఉ ంటుందని పేర్కొన్నారు.

అక్రమ వలసల ప్రభావం ఇప్పుడు కేవలం సరిహద్దు ప్రాంతాలకే పరిమితం కాలేదని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వాటి ప్రభావం పట్టణ కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు, గిరిజన ప్రాంతాలు, ఇతర సామాజికంగా, ఆర్థికంగా సున్నితమైన ప్రాంతాల వరకు విస్తరించిందని ఒక ప్రభుత్వ నోటిఫికేషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవోలేకర్ నేతృత్వంలో జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌ఎల్‌సిడిసి) ఏర్పాటు చేసింది. దిల్లీ కేంద్రంగా పనిచేసే ఈ కమిటీలో సెన్సస్ కమిషనర్‌తో పాటు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఏడాదిలోగా తన నివేదికను సమర్పిస్తుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాయింట్ సెక్రటరీ (విదేశీయులు–1) ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని అమిత్ షా చెప్పారు.

## వివాదం పరిష్కరించేది ఎవరు

### మెగాస్టారా ? పవర్ స్టారా?

### ప్రొడ్యూసర్స్ వెర్సెస్ ఎగ్జిబిటర్స్




హైదరాబాద్.అమృత్ తెలంగాణ: తెలుగు సినీ పరిశ్రమలో థియేటర్ వ్యవస్థ పై నెలకొన్న వివాదం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. ఓ వైపు మెగాస్టార్ చిరంజీవితో ఎగ్జిబిటర్లు సమావేశం కావడం.. మరో వైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో నిర్మాతలు భేటీ కావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. థియేటర్ల నిర్వహణలో ప్రస్తుతం అమలవుతున్న విధానం పై ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య తీవ్ర భేదాభిప్రాయాలు రావడంతో వివాదం మరింత ముదురుతుంది. ఎగ్జిబిటర్లు 'పర్సంటేజ్ సిస్టం' కొనసాగించాలని పట్టుబడుతుండగా.. నిర్మాతలు మాత్రం 'రెంటల్ విధానం' తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంతకీ.. ఈ వివాదాన్ని పరిష్కరించేది ఎవరు..?

చిరుతో ఎగ్జిబిటర్స్ భేటీ..

మెగాస్టార్ చిరంజీవితో ఎగ్జిబిటర్లు సమావేశమై తమ సమస్యలు వివరించగా.. నిర్మాతలు పవన్ కళ్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ కావడం వెనుక రాజకీయ, వ్యాపార కోణాల పై ఊహాగానాలు మొదలయ్యాయి. సినీ పరిశ్రమలో థియేటర్ రెవెన్యూ షేరింగ్ అంశం గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారింది. పెద్ద సినిమాలకు ఒక విధానం.. చిన్న సినిమాలకు మరో విధానం అమలవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఓటీటీ ప్రభావం పెరిగిన తర్వాత థియేటర్ల ఆదాయం తగ్గిందని ఎగ్జిబిటర్లు వాదిస్తుండగా.. భారీ అద్దెలతో నిర్మాతలు నష్టపోతున్నామని నిర్మాతల వర్గం చెబుతోంది.

నిర్మాతలకు ధైర్యం చెప్పిన పవన్

ఇప్పటికే ఈ అంశం పై పలుమార్లు చర్చలు జరిగినా స్పష్టమైన నిర్ణయం వెలువడలేదు. అయితే.. ఇప్పుడు చిరంజీవి, పవన్ కళ్యాణ్ లతో వేర్వేరుగా రెండు వర్గాలు సమావేశం కావడం ఆసక్తిగా మారింది. మరో వైపు సోషల్ మీడియాలో మాత్రం అన్నయ్యతో ఎగ్జిబిటర్లు.. తమ్ముడితో నిర్మాతలు అంటూ పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ వివాదం రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశముందని ప్రచారం జరుగుతుంది. ఇదిలా ఉంటే.. పవన్ కళ్యాణ్ తో నిర్మాతలు భేటీ అయ్యారు. ఈ భేటీలో ఇండస్ట్రీ సమస్యల పట్ల పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో టాలీవుడ్ అగ్ర నిర్మాతలు మైత్రీ మూవీస్ రవిశంకర్, సూర్యదేవర నాగవంశీ, సాహు గారపాటి, కిలారు వెంకట సతీష్, చెరుకూరి సుధాకర్ పాల్గొన్నారు. ప్రభుత్వ పెద్దలతో జరిగిన ఈ భేటీ రాబోయే రోజుల్లో ఇండస్ట్రీకి మరింత మేలు చేకూరుస్తుందని.. నిర్మాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. కంగారు పడద్దు.. అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని నిర్మాతకు పవన్ కళ్యాణ్ ధైర్యం చెప్పారని తెలిసింది. మరి.. పవన్ ఈ వివాదాన్ని పరిష్కరస్తారేమో చూడాలి.

## సిద్ధరామయ్య రాజీనామా!- మే30న కర్ణాటక కొత్త సీఎం ప్రమాణ స్వీకారం?



న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: కర్ణాటకలో నాయకత్వ మార్పు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమావేశమైన తర్వాత పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. సీఎం సిద్దరామయ్య గురువారం రాజీనామా చేస్తారని విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సిద్దరామయ్య గురువారం గవర్నర్‌ను సమయం కోరడం, నాయకత్వ మార్పుపై అప్పుడే మాట్లాడతానని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా మే 30న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాల సమాచారం.

శివకుమార్తో ఆల్పాహార సమావేశం

మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో నాయకత్వ మార్పుపై అసలు చర్చే జరగలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టంగా చెప్పినప్పటికీ మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సీఎంఓ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం సిద్ధరామయ్య తన రాజీనామాను గవర్నర్ గెహ్లోత్‌కు సమర్పించే అవకాశం ఉంది. సిద్ధరామయ్య తన అధికారిక నివాసం 'కావేరి'లో గురువారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రివర్గ సహచరులతో అల్పాహార సమావేశం నిర్వహించనున్నారు. మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బెంగళూరులోని విధాన సౌధలో ఆయనకు సీఎం నివాళులు అర్పించారు. తర్వాత సీఎం మార్పునకు సంబంధించి అడిగిన ప్రశ్నలపై గురువారమే మాట్లాడతానని సిద్దరామయ్యచెప్పారు.

విడివిడిగా కలిసిన నేతలు

దిల్లీలో మంగళవారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు సిద్ధరామయ్య, శివకుమార్‌లతో విడివిడిగా సమావేశయ్యారు. వారితో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పదవి నుంచి తప్పుకోవాలని సిద్దరామయ్యను అధిష్టానం కోరినట్లు సమాచారం. సిద్దరామయ్యకు రాజ్యసభ స్థానం, కేంద్ర స్థాయిలో కీలక పాత్ర ఇవ్వజూపినట్లు వచ్చాయి. అయితే రాజ్యసభ ఎన్నికలు, కర్ణాటక శాసనమండలి ఎన్నికల గురించే చర్చించినట్లు సమావేశం తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. నాయకత్వ మార్పు గురించి కాదని చెప్పారు.

చెరోసగం రోజులు పాలిద్దాం!

గతేడాది కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నప్పటి నుంచి నాయకత్వ మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి. గత 18 నెలలుగా డీకే శివకుమార్ అనుచరులు ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడతారని చెబుతున్నారు. ఇదేసమయంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు సీనియర్ కాంగ్రెస్ నేత జి. పరమేశ్వరకు సీఎంగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ కర్ణాటక వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సూర్జేవాలా బెంగళూరులో కాంగ్రెస్ నాయకులతో సమావేశమై నాయకత్వ మార్పుపై స్పష్టత ఇచ్చే అవకాశముందని సమాచారం.

కాంగ్రెస్పై బీజేపీ విమర్శలు

మూడేళ్లుగా కర్ణాటకలో ప్రభుత్వం సుపరిపాలన అందించడంలో విఫలమైనట్లు అర్థం చేసుకుని సీఎం సిద్దరామయ్యను మార్చాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని బీజేపీ విమర్శించింది. తదుపరి ముఖ్యమంత్రి ఎవరైనప్పటికీ రాష్ట్రంలో మధ్యంతర ఎన్నికలు జరుగుతాయని, దీన్ని ఎవరూ ఆపలేరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర జోస్యం చెప్పారు. శివమొగ్గలో విలేకరుల మాట్లాడిన విజయేంద్ర అసలు సమస్య సీఎం ఎవరు అవుతారనేది కాదని రాష్ట్ర పరిపాలన గురించి అని అన్నారు. రాష్ట్రంలో అంతర్గత కలహాల కారణంగా పరిపాలన పూర్తిగా కుప్పకూలిందని ఆరోపించారు. సిద్ధరామయ్య హయాంలో వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ముడా సైట్ కేటాయింపుల వంటి కోట్లాది రూపాయల కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే, సిద్ధరామయ్య రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని మండిపడ్డారు.

## టీడీపీ మహానాడు రికార్డు..

### వర్చువల్‌గా పాల్గొన్న 6 లక్షల కార్యకర్తలు




అమరావతి, అమృత్ తెలంగాణ: తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన లభించింది. హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన ఈ మహానాడులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లస్టర్లతో పాటు తెలంగాణ, అండమాన్, ఇతర దేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. మొత్తం ఆరు లక్షల మంది కార్యకర్తలు మహానాడులో పాల్గొన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్ల ద్వారా కార్యకర్తలు తమ ఐడీ కార్డులతో హాజరు నమోదు చేసుకున్నారని తెలిపారు. రామ్మోహన్ నాయుడు ఈ ప్రకటన చేయగానే మహానాడులో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు హర్షధ్వానాలు చేశారు. ఒక ప్రాంతీయ పార్టీ హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు నిర్వహించడం, లక్షలాది మంది వర్చువల్‌గా పాల్గొనడం రికార్డు అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## సిబిఎస్ఇ ఫలితాల అవకతవకలపై ప్రధానికి జవాబుదారీతనం లేదు : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ:సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో జరిగిన భారీ అవకతవకలపై ప్రధాని మోడీ మౌనం వహించడంపై బుధవారం కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సిబిఎస్ఇ పరీక్షా ఫలితాల్లో భారీ అవకతవకలు జరిగాయి. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు షాక్‌కి గురయ్యారు అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఇక మోడీ గారి విషయానికొస్తే ఎప్పటిలాగే సమాధానం లేదు.. జవాబుదారీతనం లేదు అని రాహుల్ విమర్శించారు. సిబిఎస్ఇ అక్రమాలపై స్వతంత్ర జ్యుడీషియల్ విచారణ జరిపించడంతోపాటు వేగంగా విచారణ పూర్తయ్యేందుకు ఒక సిట్ ఏర్పాటు చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. కాగా, ఈ సందర్భంగా సిబిఎస్ఇ పరీక్షా పత్రాల్ని మూల్యాంకనం చేసిన సిఓఇఎంపిటి సంస్థపై రాహుల్ ఆరోపణలు చేశారు. 2019లో తెలంగాణాలో గ్లోబరేనా పేరుతో కాంట్రాక్ట్‌ని సిఓఇఎంపిటి సంస్థ పొందింది. 2019 తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో జరిగిన అక్రమాలపై కూడా వివాదం నడిచింది. ఈ సంస్థ గురించి రాహుల్ ప్రస్తావిస్తూ.. గ్లోబరేనా కాకుండా సిఓఇఎంపిటిగా ఈ సంస్థ పేరు మార్చుకున్నా.. దాని చరిత్ర అందరికీ తెలుసు. అయినా కాంట్రాక్టును ఆ కంపెనీకే అప్పగించారు. 1.85 లక్షల మంది చిన్నారుల భవిష్యత్తును ఆ కంపెనీకి అప్పగించారు. అలాంటి అవకతవకలకు పాల్పడే సిఓఇఎంపిటి కంపెనీకి కాంట్రాక్టు ఎందుకిచ్చారు? ఎవరు ఆదేశాల మేరకు ఇచ్చారు? కాంట్రాక్టును కేటాయించడంలో ఏ నియమ నిబంధనలను ఉల్లంఘించారు? సిఓఇఎంపిటి యాజమాన్యానికి, మోడీ ప్రభుత్వానికి ఉన్న సంబంధం ఏమిటి? అని రాహుల్ ప్రశ్నించారు.

## ప్రధాని మోడీతో తొలి భేటీ...



న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇవాళ ప్రధాని నరేంద్ర మోడీతో ఢిల్లీలో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ ప్రధాని మోడీనితొలిసారిగా కలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ముందుగా ఢిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న సీఎం విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు 25నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో తమిళనాడుకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. భేటీ అనంతరం ఇరువురు నేతలు కలిసి దిగిన ఫొటోలను ప్రధానమంత్రి కార్యాలయం అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర సహకారం, పెండింగ్ ప్రాజెక్టులు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# మహిళా సాధికారతతోనే సమాజ ప్రగతి సాధ్యం : జిల్లా కలెక్టర్ రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



హాజరైన మహిళా సంఘాలు నాయకులు

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' మహిళా వారోత్సవాలలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన మండల సమాఖ్య సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, మహిళలు కేవలం గృహిణులుగానే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' ద్వారా అర్హులైన ప్రతి మహిళకు, స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వ రాయితీలు, రుణాలు సకాలంలో అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాలను మరింత సులభతరం చేస్తామని, వారు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అన్ని విధాలా చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను చైతన్యపరచడంలో, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మండల సమాఖ్యలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సర్వసభ్య సమావేశాలు కేవలం చర్చలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రగతికి బాటలు వేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని కోరారు. సమాజంలో ఇంకా అక్కడక్కడా కొనసాగుతున్న బాల్యవివాహాలను అరికట్టడంలో మహిళా సంఘాలు చొరవ చూపాలని, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని అన్నారు. మహిళల సంక్షేమం, రక్షణే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు అన్ని రకాల మౌలిక వసతులు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాల ప్రతినిధులను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ రవీందర్ రాథోడ్, అధికారులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు, కార్యదర్శి, వివిధ గ్రామాల విఓఏలు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యాలయంలోనూ మహిళలకు రక్షణ కల్పించాలి - జిల్లా కలెక్టర్ రాజర్షిషా





సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



హాజరైన మహిళలు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మహిళా ఉద్యోగులు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాలలో భాగంగా బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో మహిళా సంక్షేమ శాఖ, ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'పోష్ యాక్ట్ పై ప్రత్యేక అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం చట్టప్రకారం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. 10 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది సిబ్బంది పనిచేసే ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో తప్పనిసరిగా 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ' ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒకవేళ ఏ చిన్న కార్యాలయంలోనైనా ఈ కమిటీ అందుబాటులో లేకపోతే, జిల్లా స్థాయిలోని లోకల్ కంప్లైంట్ కమిటీ ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా విచారణలు చేపడతామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే మెజారిటీ ప్రభుత్వ విభాగాలు కేంద్ర ప్రభుత్వ 'షీ-బాక్స్' పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నాయని, ఇంకా పెండింగ్‌లో ఉన్న శాఖలు ఏవైనా ఉంటే తక్షణమే ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కమిటీల పనితీరును రాష్ట్ర, జాతీయ మహిళా కమిషన్లు నిరంతరం పర్యవేక్షిస్తుంటాయని వివరించారు. మహిళా ఉద్యోగులకు తమ హక్కులపై పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, దురదృష్టవశాత్తూ ఏవైనా వేధింపులు ఎదురైతే ఎక్కడ, ఎలా ఫిర్యాదు చేయాలో తెలియజేసేలా ప్రతి ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో, ఎంఆర్సి కార్యాలయం, అన్ని జిల్లా స్థాయి విభాగాల్లోని స్పష్టంగా కనిపించే ప్రదేశాలలో ఫ్లెక్సీలు లేదా కలర్ పోస్టర్లను ప్రదర్శించాలని ఆదేశించారు. దీనిపై తీసుకున్న చర్యల తాలూకు నివేదికను త్వరలోనే జిల్లా సంక్షేమ అధికారికి సమర్పించాలన్నారు. బాధితులు అధైర్యపడకుండా టోల్ ఫ్రీ నెంబర్ 181, షీ-బాక్స్ పోర్టల్ లేదా నేరుగా రాతపూర్వక ఫిర్యాదుల ద్వారా తమ సమస్యలను కమిటీల దృష్టికి తీసుకురావచ్చని ఈ సదస్సు ద్వారా వివరించారు. అనంతరం మహిళా ఉద్యోగుల హక్కులు, రక్షణ మార్గదర్శకాలతో పోష్ యాక్ట్ ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ రవీందర్, డిహెమ్హెచ్వో నరేందర్, డివైఎస్ఓ శ్రీనివాస్, డిఎస్సీడివో సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, ఎల్సి కమిటి చైర్ పర్సన్ భవన సింగ్, జడ్పీ సీఈఓ రవి, కోఆర్డినేటర్ యశోద, వివిధ శాఖల అధికారులు, ఇంటర్నల్ కమిటి మెంబెర్స్, మహిళా ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో ఘనంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి

## నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మాజీ తొలి ప్రధానమంత్రి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాల వేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి దృశ్యం



మీడియాతో మాట్లాడుతున్న అదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ భారత తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారత నిర్మాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని ఆదిలాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్మరించుకున్నారు.

స్థానిక నెహ్రూ చౌక్‌లో ఉన్న నెహ్రూ విగ్రహం వద్ద ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో AMC సభ్యులతో కలిసి చాచా నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్బంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మరియు స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన అపారమైన కృషిని, త్యాగాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పంచవర్ష ప్రణాళికలు, భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో దేశ వ్యవసాయ రంగానికి నెహ్రూ వేసిన పునాదులే నేటి ప్రగతికి కారణమని శ్రీకాంత్ రెడ్డి కొనియాడారు.

కార్యక్రమం లో ఏఎంసీ సభ్యులు అల్లూరి చంద్రశేఖర్ రెడ్డి, ఇందూరి దివాకర్, మద్దెల పోశెట్టి, కొరటి ప్రభాకర్, రైతు నాయకులు నల్లా గణపతి రెడ్డి, అలీమ్ ఖాన్, ఫహీమ్ మరియు రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయండి : కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల అమృత్ తెలంగాణ మే 27: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి, 24 గంటల్లో అన్లోడింగ్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల వల్ల రైతులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా డాటా ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహరావు, డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ నూతన పాలకవర్గం మొదటి సమావేశం పాల్గొన్న ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



రాయికల్ అమృత్ తెలంగాణ మే 27: రాయికల్ పట్టణం మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్.. రాయికల్ మండలం మున్సిపాలిటీ పరిధిలో గల పలు సమస్యలపై చర్చించడం జరిగింది. మీటింగ్ అనంతరం బతుకమ్మ చీరలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు అధికారులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# వివోఏల సమ్మెకు మద్దతు పలికిన బిఆర్ఎస్ నాయకులు



వివో ఏలకు మద్దతు పల్కిన బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మే 27 అమృత్ తెలంగాణ దిలావార్పూర్ మండల కేంద్రంలో వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు బి ఆర్ ఎస్ నాయకులు బుధవారం మద్దతు తెలిపారు. మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం వివో ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ఆరు రోజులుగా సమ్మె చేపట్టిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇందులో నాయకులు అశోక్ శ్రీనివాస్ సత్యం వివోఏలున్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

## మిల్లుల వద్ద అన్‌లోడింగ్‌లో ఆలస్యం వద్దు



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలో మిగిలి ఉన్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సోన్ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, ఐకేపీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రానికి వచ్చిన ధాన్యం పరిమాణం, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, తేమ శాతానికి వచ్చి ఇంకా తూకం వేయాల్సిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. "నిర్ణీత తేమ శాతానికి రాగానే ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని, లారీల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉండకూడదని కలెక్టర్స్పష్టం చేశారు. అంతకుముందు కలెక్టర్ జాఫ్రాపూర్ గ్రామంలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వస్తున్న ధాన్యం లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల వద్ద వేచి ఉన్న లారీల వివరాలు, అన్‌లోడింగ్ వేగంపై అధికారులను ఆరా తీశారు. రానున్న రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం అన్‌లోడింగ్‌లో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచి ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు స్పష్టం చేశారు. పౌరసరఫరాలు, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం మామడ మండలం కొరిటికల్ గ్రామంలోని రైస్ మిల్లులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియలను వెంటవెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్లు సంతోష్, శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నెహ్రూ సేవలు దేశానికి ఆదర్శం..

# జగిత్యాలలో 62వ వర్ధంతి కార్యక్రమం..



జగిత్యాల అమృత్ తెలంగాణ మే 27: జగిత్యాల తహశీల్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజీ ముకేష్ ఖన్నా ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 62వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ముఖ్య అతిథి డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ నిర్మాణం, ప్రజాస్వామ్య పరిరక్షణ,

శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగ్గురు అంతః రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దేశవ్యాప్తంగా చోరీలకు పాల్పడిన కరడుగట్టిన నేరస్తులు**

**దొంగలించిన కారుకు ఫేక్ నెంబర్ ప్లేట్లు, ఫేక్ ఫాస్ట్ ట్యాగ్‌లతో పోలీసులను మభ్యపెట్టే ప్రయత్నం**

**ఆదిలాబాద్, కామారెడ్డి, వరంగల్ జిల్లాలలో వరుస చోరీలకు పాల్పడిన అంతః రాష్ట్ర ముఠా అరెస్ట్ : 100% రికవరీ**

**దొంగలించిన బంగారం విలువ దాదాపు 46,46,600 లక్షలు**

**దాదాపు 33 తులాల బంగారం, 71 తులాల వెండి, ఒక కారు, 4 సెల్ ఫోన్స్, రూ 15,200 వేల నగదు, దొంగతనానికి ఉపయోగించే వస్తువులు స్వాధీనం**

**వివరాలను వెల్లడించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతః రాష్ట్ర దొంగల ముఠాను ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈరోజు స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు.

నిందితుల వివరాలు

1. జైచంద్, తండ్రి గోకుల్ చంద్, వయస్సు 33 సంవత్సరాలు, వృత్తి ఫోన్ బిజినెస్, నివాసం ఇంద్రా క్యాంప్, త్రిలోక్‌పురి, ఈస్ట్ ఢిల్లీ.
2. ప్రేమ్ షాలిక్‌రామ్ ఖత్రి, తండ్రి షాలిక్‌రామ్, వయస్సు 35 సంవత్సరాలు, నివాసం నవ కన్యా నగర్, భారత్‌వాడా పాండి, నాగపూర్, మహారాష్ట్ర.
3. సతేంద్ర గుప్తా, తండ్రి రాజ్‌బహదూర్ గుప్తా, వయస్సు 41 సంవత్సరాలు, నివాసం రాజ్‌నగర్, ఖిల్‌గావ్, నాగపూర్, మహారాష్ట్ర.

కేసు వివరాలలో

ఈ నెల 23వ తేదీన ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంటిలో జరిగిన చోరీ కేసును పోలీసులు సవాల్‌గా తీసుకొని సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టి విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఈ ముగ్గురు నిందితులు మహారాష్ట్ర రాష్ట్రంలో దొంగలించిన స్విఫ్ట్ డిజైర్ కారుకు ఫేక్ నెంబర్ ప్లేట్లు అమర్చడంతో పాటు ఫేక్ ఫాస్ట్ ట్యాగ్ ఉపయోగించి రాష్ట్రాల మధ్య సంచరిస్తూ పోలీసులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసినట్లు గుర్తించారు. నిందితులు ఈ నెల 23వ తేదీన రాత్రి ఆదిలాబాద్ పట్టణానికి చేరుకొని శాంతినగర్ ప్రాంతంలో చోరీకి పాల్పడిన తర్వాత అదే రాత్రి ఆర్మూర్ ఇందలవాయి బస చేసి, మరుసటి రోజు కామారెడ్డి జిల్లాలో చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం 25వ తేదీన హైదరాబాద్ ప్రాంతంలో సంచరించి, 26వ తేదీన వరంగల్ కమిషనరేట్, కాజీపేట పరిధిలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో భారీ చోరీలకు పాల్పడ్డారు. ఈ ముగ్గురు నిందితులు గతంలో హత్య, హత్య యత్నం, రాబరీ, చైన్ స్నాచింగ్ తదితర తీవ్రమైన నేరాలలో కూడా పాల్గొన్న కరడుగట్టిన నేరస్తులుగా, ఎన్నో సార్లు జైలుకు వెళ్లినట్టు గుర్తించడం జరిగింది. ఈ నిందితులను ఈరోజు ఉదయం 8 గంటలకు స్థానిక సిసిఐ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆపకుండా పారిపోతున్న సమయంలో వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. దొంగతనం చేసిన బంగారం విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ 46,46,600 లక్షల విలువ చేస్తుందని తెలిపారు.

స్వాధీనం చేసుకున్న ఆస్తి వివరాలు :-

- బంగారు ఆభరణాలు -- 331.900 గ్రాములు
- వెండి ఆభరణాలు -- 718.700 గ్రాములు
- స్విఫ్ట్ డిజైర్ కారు నెం. MH-45-AL-0921 -- 01
- రూ 15,200/- నగదు.
- సెల్ ఫోన్లు -- 04
- ఇనుప రాడ్లు -- 02
- డ్రిల్లింగ్ రాడ్ -- 01
- కట్టింగ్ ప్లేయర్ -- 01
- ఫేక్ నెంబర్ ప్లేట్లు -- 02
- టపారియా -- 01

రికవరీ వివరాలు :-

ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్
క్రైం నెం. 382/2026
సెక్షన్లు 331(4), 305
(ఖ) దీఛీా ప్రకారం నమోదైన కేసుకు సంబంధించిన 60.700 gram బంగారు ఆభరణాలు స్వాధీనం.

వరంగల్ పోలీస్ కమిషనరేట్
కాజీపేట పోలీస్ స్టేషన్, ప్రశాంత్ నగర్, నీట్ ప్రొఫెసర్ ఇంట్లో.
క్రైం నెం. 128/2026
సెక్షన్లు 331(4), 305 (a) BNS ప్రకారం నమోదైన కేసుకు సంబంధించిన 270.700 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు 718.700 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం.

సుబేదారి పోలీస్ స్టేషన్,విజయ్ పాల్ కాలనీ వరంగల్ పోలీస్ కమిషనరేట్
క్రైం నెం. 282/2026
సెక్షన్లు 331(4), 305 (a) BNS ప్రకారం నమోదైన కేసుకు సంబంధించిన 1.900 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం.

కామారెడ్డి పోలీస్ స్టేషన్, కామారెడ్డి జిల్లా
క్రైం నెం. 417/2026
సెక్షన్లు 331(4), 305 (a) BNS ప్రకారం నమోదైన కేసుకు సంబంధించిన 4.600 గ్రాముల బంగారు ఆభరణాలు, స్వాధీనం. ఈ అంతః రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి భారీ మొత్తంలో చోరీ సొత్తును రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించిన సీఐ సునీల్ కుమార్, ఎస్ఐలు అశోక్, సంజయ్, రమేష్, హనుమంతు, సట్ల శ్రీను, జాకీర్, ఆర్ఎస్ రమేష్, రుక్మారెడ్డి, రాహత్ ఐటి కోర్ సిబ్బంది ఆర్ఎస్ఐ గోపి, కానిస్టేబుల్ త్రిశూల్ ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్, ఆర్.ఎస్.ఐ గోపి, ఎస్ఐలు అశోక్, సంజయ్ మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ ను వెంటనే విధుల్లోకి తీసుకోండి ! : పొన్నం ప్రభాకర్



జగిత్యాల అమృత్ తెలంగాణ మే 27: జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించినట్లుగా ఒక వీడియో జిల్లాలో వైరల్ అవుతోంది. కాంగ్రెస్ నాయకుడి ఫిర్యాదుతో అధికారులు తొందరపడి డ్రైవర్‌ను తొలగించారని, అతని చర్య పెద్ద తప్పు కాదని, సస్పెండ్ చేయవద్దని తాను ఆదేశాలు ఇచ్చానని మంత్రి పేర్కొన్నారు. తొందరపడి తొలగింపు ఉత్తర్వులు ఇచ్చిన డిపో మేనేజర్‌ను వేరే డిపోకు బదిలీ చేయాలని కూడా ఆదేశించినట్లు మంత్రి ఆ వీడియోలో తెలిపారు.

# మెట్ పల్లిలో మహిళా వారోత్సవాలు



మెట్ పల్లి అమృత్ తెలంగాణ మే 27: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో మహిళా వారోత్సవాల మూడవ రోజు కార్యక్రమం బుధవారం మున్సిపాలిటీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మండల పరిధిలోని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగినులకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సిడిపిఓ మనేమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారిని కనకతార, మున్సిపాలిటీ మేనేజర్ వెంకటలక్ష్మి, జగిత్యాల జిల్లా సఖి లావణ్య, హబ్ నుండి హేమ పాల్గొన్నారు. మహిళా వారోత్సవాలలో ఉద్యోగినులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు

## రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 27, 2026: ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ సి పి వెంకటేశ్వర్లు, మండల తహసీల్దార్ వనజ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎకరానికి 25 క్వింటాళ్ల ధాన్యం వచ్చేదని, ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ప్రతి సంవత్సరం కొనుగోలు లక్ష్యం పూర్తి అయ్యేదని, ఈ సంవత్సరం 4వ తేదీ వరకు 1 లక్ష 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమంలో భాగంగా పెద్దపల్లి లో 2 గోదాములు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, పశ్చిమ బెంగాల్ లో జరిగిన ఎన్నికల నేపథ్యంలో హమాలీల కొరత ఏర్పడినందున స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. లారీలు సమకూర్చడం కొరకు సింగరేణి సంస్థతో మాట్లాడగా లారీలను అందించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని, 10 ఇసుక లారీలను సైతం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళన చేపట్టే దిశగా రెచ్చగొడుతున్నారని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం



కోసం కలిసి రావాలని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో పంట ఆలస్యంగా వస్తుందని, ఆయా ప్రాంతాల రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్లు, 500 రూపాయల సన్న రకం వడ్ల బోనస్, గృహ జ్యోతి, ఇతర పథకాల ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 51 వేల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 36 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని జైపూర్ మండలంలో గల సుముఖ గోదాములో 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే అవకాశం ఉందని, 50 మంది హమాలీలు పనిచేస్తున్నారని, రైస్ మిల్లులు, గోదాముల వద్ద ధాన్యం ప్రక్రియ వేగంగా జరిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 62 శాతం ట్యాబ్ ఎంట్రీ జరిగిందని, సంబంధిత రైతుల ఖాతాలలో 48 గంటలలో నగదు జమ చేయడం జరుగుతుందని, 3 రోజులలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మొక్కజొన్న పంట కొనుగోలు లక్ష్యం 8 వేల 700 మెట్రిక్ టన్నులు కాగా ఇంకా 3 వేల మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు చేయవలసి ఉందని, 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రావలసి ఉందని తెలిపారు. గత సంవత్సరం జూన్ 6వ తేదీన ధాన్యం ప్రక్రియ పూర్తి కాగా ఈసారి మరింత ముందుగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్ తో కలిసి జైపూర్ మండలం టేకుమట్ల లోని కొనుగోలు కేంద్రం, బాలాజీ గోదాము, షెట్ పల్లి లోని ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందారం లోని వరలక్ష్మి రైస్ మిల్, సుముఖ గోదాములను సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేడిగూడలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా





రైతులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ పంట కొనుగోళ్లతో పాటు గోదాంలకు తరలించే రవాణా ప్రకియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం సాత్నాల మండలం మేడిగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి వస్తున్న పంట దిగుబడులు, ప్రస్తుత కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సేవలపై ఆయన అక్కడి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యార్డ్‌లో జరుగుతున్న వివిధ పనుల పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారులకు సూచనలు చేస్తూ, మార్కెట్ యార్డ్‌కు పంటను తీసుకువచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పంట కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, గిడ్డంగులకు తరలించేలా రవాణా చర్యలు వేగవంతం చేయాలని, రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో మండల ప్రత్యేక అధికారి రామ్ ప్రసాద్, తహసీల్దార్ జాదవ్ రామారావు, ఎంపిడిఓ వెంకటరాజు ,ఏవో రాథోడ్ కైలాష్, సర్పంచ్ లక్ష్మీ భాయి, స్థానిక మార్కెట్, రెవెన్యూ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ మండల కమిటీ సమావేశం




అమృత్ తెలంగాణ ఆలేరు పట్టణంలో బుధవారం సిపిఐ మండల కమిటీ సమావేశం కార్యదర్శి చౌడబోయిన కనకయ్య అధ్యక్షతన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ..


ఐకెపి సెంటర్ దగ్గర ఉన్న ధాన్యాన్ని వేగవంతం చేయాలని వర్షాలు పడే సూచనలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు.

రైతులకు మనో ధైర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని, రైతులకు కాంప్లెక్స్ ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచి రైతుల నాదుకోవాలని కోరారు.

మధు, ఓదయ్య, స్వామి, రాజు, ప్రవీణ్, ఆంజనేయులు, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలును వేగవంతం చేయాలి: కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ జిల్లాలో జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జొన్నల కొనుగోళ్లు, రవాణా ఏర్పాట్లపై ఆయన సంబంధిత అధికారులతో అత్యవసర గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. జొన్నల రవాణా, గిడ్డంగుల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు పక్కాగా పర్యవేక్షించాలని, కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ చిత్రు, మార్క్ ఫెడ్ డిఎం మహేష్ కుమార్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్, రవాణా, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో రూ.17.50 లక్షలు రసూలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు

## కోర్టులో ఉద్యోగాల ఇప్పిస్తానంటూ మాయమాటలు

## బాధితుల ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభం : ఇచ్చోడ SHO కె. నరేష్ కుమార్



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ ఇచ్చోడ మండలంలోని కామగిరి గ్రామానికి చెందిన నక్కల రమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ ఎస్సై కె. నరేష్ కుమార్ తెలిపారు. ఫిర్యాదు ప్రకారం, నిందితుడు జీడిమెట్లకు చెందిన ఉప్పడి శంకర్ అనే వ్యక్తి కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి ఫిర్యాదుదారు కుటుంబ సభ్యుల నుంచి దశల వారీగా రూ. 18,50,000/- తీసుకున్నాడు. అనంతరం ఉద్యోగాలు ఇప్పించలేనని చెబుతూ డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి కేవలం రూ. 1 లక్ష మాత్రమే తిరిగి ఇచ్చి మిగతా రూ. 17.50 లక్షలు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి మోసాలకు గురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. నిందితునిచే బాధింపబడిన ఇతర బాధితులు ఎవరైనా ఉన్నట్లయితే నిర్భయంగా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

# ఫోటో క్యాప్చర్ సమస్యలు తొలగించాలి : జూకంటి పౌల్



అమృత్ తెలంగాణ ఆలేరు మండలంలోని గుండ్లగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జూకంటి పౌలు డిమాండ్ చేశారు. సోమవారం ఉపాధి కూలీల ఫోటో క్యాప్చర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..

ఉపాధి హామీ పనుల వద్ద ఫోటో క్యాప్చర్ సరిగా లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కారణంగా పలువురు కూలీలు పనులు కోల్పోతుండగా ఉపాధి హామీ చట్టంలో తీసుకొచ్చిన మార్పులను రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఫోటో క్యాప్చర్ సమస్యల వల్ల అనేక గ్రామాల్లో 10 నుంచి 20 మంది వరకు కూలీలు పనులు చేయలేక తిరిగి వెళున్నారని తెలిపారు. నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో పనులు కేటాయించడం వల్ల మండుటెండలో నడిచి వెళ్లి తిరిగి రావడం కూలీలకు భారంగా మారిందన్నారు. గ్రామ పంచాయతీలు,అధికారులు ఆయా గ్రామాల్లో వాహనాల ద్వారా కూలీలను పని ప్రదేశాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని నిబంధనలు ఉన్నప్పటికీ, చాలా చోట్ల అవి అమలు కావడం లేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో రెండు, మూడు నీటి క్యాన్లతో సరిపెడుతున్నారని, కూలీల సంఖ్యకు అనుగుణంగా తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పని సమయంలో కూలీలకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, ఉపాధి కూలీలకు రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పాత విధానాన్ని కొనసాగించడం వల్ల కూలీలకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు.

# రైతు కుటుంబాలకు ఆర్ధిక సహాయం అందజేత




అమృత్ తెలంగాణ: భువనగిరి మండల లోని గౌస్ నగర్ గ్రామానికి చెందిన పాక కొమురయ్య యాదవ్ (65) ఎర్రంపల్లి గ్రామానికి చెందిన రైతు సాయి రెడ్డి యాదిరెడ్డి (68) ఇటీవలనే అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు పిఎసిఎస్ చందుపట్ల బ్యాంకు తరపున 30 వేల రూపాయల ఆర్థిక సహాయం ను బ్యాంకు చైర్మన్ మందాడి లక్ష్మీనరసింహారెడ్డి వేరువేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గంధ మల్ల వెంకటేశ్వర్లు, బ్యాంకు డైరెక్టర్లు బల్గురి మధుసూదన్ రెడ్డి, సుబ్బురు మహేందర్, పల్లెర్ల స్వామి, అంగడి బాలమ్మ, చింతల వెంకటరెడ్డి, నల్ల లక్ష్మి, బూర్గు సౌజన్య, పెద్దింటి మల్లారెడ్డి, బ్యాంకు సీఈఓ నల్లమసు రాములు, బ్యాంకు సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# కవ్వించి రెచ్చగొడుతున్న ఖిలాడీ గాళ్




మాస్ మహారాజా రవితేజ సరసన ఖిలాడీ చిత్రంలో నటించింది మీనాక్షి చౌదరి. తనదైన అందం నటనతో యువతరాన్ని మురిపించిన ఈ బ్యూటీ సోషల్ మీడియాల్లోను అంతే స్పీడ్ గా ఉంది. నిరంతరం ఈ అందాల భామ వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తోంది. తాజాగా మరో హాట్ ఫోటోషూట్ మీనాక్షి సోషల్ మీడియాల్లో ప్రత్యక్షమైంది. మీనాక్షి ఈ ఫోటోగ్రాఫ్స్ లో టూ హాట్ గా కనిపిస్తోందంటూ బోయ్స్ కామెంట్లు చేస్తున్నారు. ఆమె అందానికి చలి జ్వరం ఖాయం! అంటూ ఫిదా అయిపోతున్నారు. మీనాక్షి తదుపరి హిట్ లో నటిస్తోంది. అలాగే కొలై అనే సినిమాలోను కథానాయికగా కనిపించనుంది. ఈ రెండు సినిమాల్లోను గ్లామర్ ఆవిష్కరణతో పాటు నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లో నటిస్తోందని సమాచారం. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుస చిత్రాలకు సంతకాలు చేస్తోంది. ఇరుగు పొరుగు భాషల్లోను లక్ చెక్ చేసుకుంటోంది. ఇక స్కిన్ షోకి ఏమాత్రం అభ్యంతరం చెప్పని మీనాక్షి ఫోటోషూట్లలోను అస్సలు తగ్గడం లేదు. పెద్ద తెరపై పెదవి ముద్దులకు అభ్యంతరం చెప్పనని స్టేట్ మెంట్ ఇచ్చిన ఈ భామకు అవకాశాలిచ్చేందుకు మన దర్శకహీరోలకు ఆసక్తి పెరిగింది. డార్లింగ్ ప్రభాస్ సరసన సలార్ లో నటించే అవకాశం ఉందని కథనాలొచ్చినా ఎందుకనో ఆ ఛాన్స్ మిస్సయ్యింది. కానీ భవిష్యత్ లో అగ్ర నాయికగా ఎదిగేందుకు అవసరమైన అన్ని క్వాలిటీస్ ఈ అమ్మడిలో దండిగా ఉన్నాయని ట్రేడ్ విశ్లేషిస్తోంది. మోడల్ కం నటి మీనాక్షి అందాల పోటీ టైటిల్ హోల్డర్. ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. అక్కడ ఆమె మిస్ గ్రాండ్ ఇండియాగా కిరీటాన్ని పొందింది. చౌదరి మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. 1వ రన్నరప్ గా కిరీటాన్ని పొందింది. 2021లో తెలుగు చిత్రం ఇచ్చట వాహనములు నిలుపరాదు తో తెరంగేట్రం చేసింది. మొదటి సినిమాతోనే ఆకట్టుకున్న ఈ బ్యూటీకి అవకాశాల పరంగా కొదవేమీ లేదు. అయితే సెలక్టివ్ గా కెరీర్ ని ముందుకు నడిపిస్తోంది.

# చిరు-ఓదెల ప్రాజెక్ట్.. నాని కామెంట్స్ విన్నారా?



దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నేచురల్ స్టార్ నిర్మాతగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నేచురల్ స్టార్ నిర్మాతగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఇంకా సెట్స్ పైకి వెళ్లని ఆ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అనౌన్స్మెంట్ తోనే చిరు- ఓదెల- నాని ప్రాజెక్ట్ పై ఫ్యాన్స్, ఆడియన్స్ వేరే లెవెల్ లో అంతా హోప్స్ పెట్టుకున్నారనే చెప్పాలి. అయితే ఆ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందోనని అంతా వెయిట్ చేస్తున్నారు. సినిమా ఎలా ఉండనుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మూవీ అప్డేట్స్ రావడం లేటు.. సోషల్ మీడియాలో అంతా వైరల్ చేస్తున్నారు. తాజాగా నాని.. తన అప్ కమింగ్ మూవీ హిట్-3 ప్రమోషన్స్ లో ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. విజయ్ దేవరకొండ ప్యారడైజ్ మూవీ తర్వాత చిరంజీవి ప్రాజెక్ట పనులు స్టార్ట్ అవుతాయని నాని తెలిపారు. ప్యారడైజ్ మూవీ షూటింగ్ మరికొద్ది రోజుల్లో మొదలవుతుందని చెప్పారు. మెగాస్టార్ సినిమాను 2027లో విడుదల చేస్తామని వెల్లడించారు. సినిమాకు సంబంధించిన అన్ని అప్డేట్స్ మరికొద్ది రోజుల్లో ఇస్తామని నేచురల్ స్టార్ పేర్కొన్నారు. సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యాక.. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, టైటిల్ వంటి మరిన్ని అప్డేట్స్ ను తప్పకుండా ఇస్తామని అన్నారు. అదే సమయంలో తాను చిన్నప్పటి నుంచి సత్యం థియేటర్ వద్ద చిరంజీవి సినిమా పోస్టర్స్ పెరిగానని చెప్పారు. ఆయనంటే తనకు మాటల్లో చెప్పలేని అభిమానముందని వెల్లడించారు. అదే సమయంలో ఇప్పుడు మెగాస్టార్ సినిమాకు నిర్మాతకు వ్యవహరిస్తుంటే.. ఒక బయోపిక్ తీస్తున్న ఫీలింగ్ కలుగుతుందని నాని అన్నారు. ఎప్పుడూ ఆ మూవీ కోసమే ఆలోచిస్తున్నానంటూ చెప్పారు. ఫ్యాన్ బాయ్ మూమెంట్ కోసం ఈగర్లీ వెయిటింగ్ అని తెలిపారు. దీంతో నాని కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. అయితే చిరంజీవి-శ్రీకాంత్ మూవీ స్టార్ట్ కావడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. వచ్చే ఏడాది షూటింగ్ మొదలు కావచ్చు. కానీ నాని మాత్రం ఆ ప్రాజెక్ట్ పై ఫుల్ ఫోకస్ పెట్టినట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఎంతైనా ఫ్యాన్ కదా అందుకేనేమో. మరి ఆ సినిమా ఎప్పుడు మొదలవుతుందో.. ఎప్పుడు వస్తుందో.. ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# అనుపమని పట్టించుకోరేంటి..? అదేంటి ఎందుకలా అంటే..



కెరీర్ మొదట్లోనే కుర్రాళ్ల హృదయాలను దోచేసిన ఈ ముద్దుగుమ్మ బొద్దుగా ఉంటే ఛాన్స్ లు రావట్లేదని సన్నగా మారింది అందాల అనుపమని టాలీవుడ్ లో పట్టించుకునే వారు కరువయ్యారు. అదేంటి ఎందుకలా అంటే.. కెరీర్ మొదట్లోనే కుర్రాళ్ల హృదయాలను దోచేసిన ఈ ముద్దుగుమ్మ బొద్దుగా ఉంటే ఛాన్స్ లు రావట్లేదని సన్నగా మారింది. అనుపమలోని ఈ మేకోవర్స్ కొంతమంది ఫ్యాన్స్ కి నచ్చినా కొంతమందికి మాత్రం రుచించలేదు. అయినా సరే ఒకసారి ఇష్టపడ్డాక తప్పదు కదా అనుకుంటూ ఆమెని అభిమానిస్తూ వచ్చారు. అదేంటో అందం అభినయం రెండు ఉన్నా కూడా అంపమకి లక్ కలిసి రాలేదు. తెలుగులో సినిమాలు చేసినా కూడా స్టార్ స్టేటస్ అందుకోలేదు. కెరీర్ లో సినిమాలు పడుతున్నా కొద్దీ స్టార్ హీరోలతో నటించే ఛాన్స్ అందుకోవాలి. కానీ అమ్మడి గ్రాఫ్ పడిపోతూ యువ హీరోలతో నటించే పరిస్థితి వచ్చింది. అఫ్కోర్స్ ఆ సినిమాలు కూడా పాపులారిటీ తెచ్చే ఛాన్స్ ఉంటుంది. కానీ అనుపమ మాత్రం ఆశించిన స్థాయిలో క్రేజ్ తెచ్చుకోలేదు. లాస్ట్ ఇయర్ తెలుగులో ఈగల్, టిల్లు స్క్వేర్ సినిమాలు చేసింది అమ్మడు. టిల్లు స్క్వేర్ సూపర్ హిట్ పడినా కూడా అమ్మడికి తర్వాత పెద్దగా ఛాన్స్ లు రాలేదు. ప్రస్తుతం అమ్మడు పరదా సినిమా చేస్తుంది. ఆ సినిమా టీజర్ తో ఆడియన్స్ లో ఆసక్తి కలిగేలా చేశారు. ఇక మరోపక్క కోలీవుడ్ స్టార్ చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ తో బిసన్ అనే సినిమా చేస్తుంది అమ్మడు. లాక్ డౌన్ అనే సినిమా కూడా చేస్తుంది అనుపమ. మలయాళంలో కూడా పెట్ డిటెక్టివ్ సినిమా చేస్తుంది అనుపమ. దానితో పాటు జె.ఎస్.కె ట్రూత్ షల్ ఆల్వేస్ అనే సినిమా చేస్తుంది. తమిళ, మళయాళ భాషల్లో పర్వాలేదు కానీ తెలుగులో మాత్రం అనుపమని పట్టించుకోవట్లేదు. రీసెంట్ గా డ్రాగన్ సినిమాతో తమిళంతో పాటు తెలుగులో కూడా సక్సెస్ అందుకుంది అనుపమ పరమేశ్వరన్. ఐతే టాలీవుడ్ లో అమ్మడికి ఛాన్స్ లు రాకపోవడానికి కారణం ఏంటన్నది తెలియట్లేదు. ఏది ఏమైనా అనుపమ విషయంలో తెలుగు మేకర్స్ ఏం ఆలోచిస్తున్నారు




# దిశ స్టైలిష్ లుక్ ఎలివేషన్ సో హాట్!



దిశా పటానీ టెంప్టింగ్ ఫోజుల గురించి చెప్పాల్సిన పనిలేదు. యువతలో నిత్యం అమ్మడి హాట్ ఫోజులు హాట్ టాపిక్. డిజైనర్ సహా అల్ట్రా మోడ్రన్ బ్యూటీగానూ అమ్మడు అగ్గి రాజేస్తుంది. ఇటీవలే మిర్రర్ సెల్ఫీలో బ్యూటీ ఓ రేంజ్ లో సెగలు పుట్టించింది. తాజాగా అమ్మడి న్యూ లుక్ ఒకటి నెట్టంట కుర్రాళ్లలో గుబులు రేపుతుంది. స్టైలిష్ బ్రాండెడ్ జీన్స్ పై బ్లాక్ కలర్ స్కిన్ టైట్ వేర్ లో అగ్గిరాస్తుంది. చినుగుల జీన్స్ చుట్టూ గోల్డ్ కలర్ చైన్ న్యూవేర్ ని మరింత ఫోకస్డ్ గా ఎలివేట్ చేస్తోంది. అమ్మడి స్కిన్ టోన్ ని టాప్ మరింత ఆకర్షణీయంగా మలిచింది. అమ్మడి క్లీవేజ్ అందాలు.. ఆ నడుం ఒంపు సొంపులు కుర్రాళ్లకి కునుకు లేకుండా చేస్తున్నాయి. రెండు చేతులు పైకెత్తి..ఆ నడుముని కాస్త 45 డిగ్రీలు బెండు చేసిన ఫోజు వావ్ అనిపించలే. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. దిశ అభిమానులు ఆ అందాన్నితనవి తీరా చూసి ఆస్వాదిస్తున్నారు. ఇక కామెంట్ల వర్షానికైతే కొదవలేదు. ఎవరి స్టైల్లో వారు చెలరేగుతున్నారు. ఇక అమ్మడి కెరీర్ విషయానికి వస్తే 'లోఫర్' తర్వాత బాలీవుడ్ లో బిజీ అయిన సంగతి తెలిసిందే. హిందీలో బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లు అందుకుని దూసుకుపోతుంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com